



జూరాల ప్రాజెక్టు

ప్రణాళిక ఉంటేనే.. ఫలితం

సాగునీటిపై ప్లానింగ్ సరిగా లేక జూరాల కింద గతేడాది ఎండిన పంటలు

- ప్రాజెక్టులో డెడ్ స్టోరేజీ.. ఎగువ నుంచి రాని చుక్కనీరు
- ఎక్కువ వరద రోజులు నమోదవుతున్నా మారని పరిస్థితి
- అధిక నీటిని నిల్వ చేసుకోవడం అత్యంత అవసరం
- ప్రాజెక్టుకు ప్రస్తుతం 8,953 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మహబూబ్‌నగర్, మే 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జూరాల ప్రాజెక్టుకు 2023 మినహా ఎనిమిదేళ్లుగా సమృద్ధిగానే వరద వస్తోంది. అయినప్పటికీ యాసంగి సీజన్‌లో సాగు, తాగునీటికి దయనీయ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. నీరందక పంటలు ఎండిపోతుండగా, దప్పిక తీర్చుకోవడానికి కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేయించుకోవాల్సి వస్తోంది. అక్కడి నుంచి జూరాలకు వచ్చే వరకు నీరంతా ఆవిరి రూపంలోనో, గుంతలు నిండటానికో సరిపోతోంది. జూరాల ప్రాజెక్టులో దాదాపు 3 టీఎంసీలకు పైగా పూడిక పేరుకుపోవడం, వస్తున్న నీటిని అవసరాలకు తగినట్లుగా వినియోగించుకోవడానికి సరైన ప్రణాళిక లేకపోవడం వల్ల యాసంగిలో సాగు, తాగునీటికి ఇబ్బందులు ఏర్పడటానికి కారణాలవుతున్నాయి. రాజకీయ ఒత్తిళ్లతోనో లేక మరేదైన కారణాలతోనో ఐఏబీ(ఇరిగేషన్ అడ్వైయిజరీ బోర్డు) సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు కట్టుబడి ఉండలేకపోతున్నారు. ఫలితంగా ఆయకట్టు పరిధిలో వేల ఎకరాల్లో పంట నష్టం జరుగుతోంది. ఈ ఏడాది యాసంగి సీజన్‌లో అదే జరిగింది. కానీ అధికారులు మాత్రం నీళ్లు అందకుండా ఎక్కడా పంటలు ఎండిపోలేదని నిర్ధారించారు. కేవలం అకాల వర్షాల ద్వారానే పంట నష్టం జరిగినట్లు ప్రభుత్వానికి నివేదికలు పంపడం గమనార్హం. ఉమ్మడి పాలమూరు జిల్లాకు ప్రధాన నీటి వనరుల్లో జూరాలదే అగ్రస్థానం. ఆయకట్టు పరిధిలోని లక్ష ఎకరాలతోపాటు నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకాలు, పలు తాగునీటి పథకాలు ఈ ప్రాజెక్టు ఆధారంగానే నడుస్తాయి. ఏటా సాగునీటి శాఖకు భారీగా నిధులు కేటాయిస్తున్నామని చెబుతున్నప్పటికీ.. సోర్స్ ప్రాజెక్టు అయిన జూరాలను ఎవరూ పట్టించుకోవడం లేదనేది స్పష్టమవుతోంది. ఈ యాసంగిలో వారబందీ ప్రకటించినప్పటికీ.. పంటలకు నీరివ్వకపోవడంతో ఎండిపోయి, రైతులు ఇబ్బందులు పడ్డారు. ప్రాజెక్టు కూడా డెడ్ స్టోరేజీకి చేరడంతో ఇబ్బంది తలెత్తింది.

వరి సాగు పెరగడంతో మరింత ఇబ్బందులు..

గతంలో ఉమ్మడి పాలమూరు జిల్లాలో యాసంగి సీజన్‌లో మొక్కజొన్న, వేరుశనగ, శనగ, మినుము, మిల్లెట్స్ తదితర ఆరుతడి పంటలను సాగుచేసేవారు. కానీ నీటి వనరుల లభ్యత పెరగడం, వరికి సరైన గిట్టుబాటు ధర, ప్రభుత్వమే

(మిగతా 6లో..)



జూరాల నుంచి నీటిని విడుదల చేయాలని రాస్తారోకో చేస్తున్న రైతులు(ఫైల్)

1125 టీఎంసీల రాక..

జూరాల ప్రాజెక్టు తెలంగాణలో కృష్ణానది ప్రవేశించిన తర్వాత వచ్చే తొలి ప్రాజెక్టు. భీమా నదికి వరద వచ్చినా జూరాలకు ఇన్‌ఫ్లో వస్తుంది. జూన్ 1 నుంచి మే 31 వరకు వాటర్ ఇయర్‌గా చూసుకుంటే, ఈ వాటర్ ఇయర్‌లో జూరాల ప్రాజెక్టుకు 1125 టీఎంసీల నీరు వచ్చింది. ఇందులో జూరాల సామర్థ్యం 9.65 టీఎంసీలే. లైవ్ స్టోరేజీ ఇంచుమించుగా ఆరు టీఎంసీలే అని చెప్పవచ్చు. కృష్ణానదికి 90 రోజులపాటు వరద వస్తుందని అంచనా. కానీ 2023 మినహా ఎనిమిదేళ్లుగా ఎక్కువగానే వరద రోజులు నమోదవుతున్నాయి. ఈ ప్రాజెక్టు నుంచి నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకాలు నడుస్తున్నాయి. ఈ యాసంగి సీజన్‌కు ముందు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఐఏబీ సమావేశంలో వారబందీ ప్రకారం రామన్‌పాడు వరకు నీటిని విడుదల చేయాలని నిర్ణయించారు. కానీ పంట చేతికి వచ్చే సమయంలో తీవ్రంగా నీటి సమస్య ఏర్పడింది. కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి 4 టీఎంసీలు విడుదల చేయాలని ఒప్పందం చేసుకున్నప్పటికీ, ఒక టీఎంసీ మాత్రమే విడుదల చేశారు. అందులోనూ 0.25 టీఎంసీల నీరు మాత్రమే ప్రాజెక్టుకు చేరింది. నీటి సమస్య ఏర్పడటానికి ప్రధాన కారణం ఏంటంటే, జూరాల ఆధారంగా ఉన్న ఎత్తిపోతల పథకాల నిల్వ సామర్థ్యం సరిగా లేకపోవడం. ఏటా వందలాది టీఎంసీలు జూరాల ద్వారా దిగువకు వెళ్తున్నప్పటికీ మిగులు జలాలను కూడా నిల్వ చేసుకోలేకపోతున్న దుస్థితి ఉంది. నెట్టెంపాడు కింద ఉన్న ర్యాలంపాడు రిజర్వాయర్‌ను లీకేజీ సమస్య వల్ల 4 టీఎంసీలకు గాను 2 టీఎంసీలతోనే నింపుతున్నారు. భీమా కింద శంకరసముద్రం రిజర్వాయర్‌ను కూడా పూర్తిగా నింపలేని పరిస్థితి ఉంది. జూరాలలో పూడిక పేరుకుపోతున్న నేపథ్యంలో ఆ మేరకు నిల్వ సామర్థ్యం ఉన్న మరో వనరును నిర్మించాలనే విషయాన్ని కూడా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు.



కల్యాణలక్ష్మి చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

ప్రభుత్వానికి అండగా ఉండండి

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- 79 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

మహబూబ్‌నగర్, మే 22 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని, లబ్ధిదారులంతా ప్రభుత్వానికి అండగా ఉండి, కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో ప్రజాపాలన అమలులోకి వచ్చిన తరువాత ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. గురువారం నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద 79 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలనలో అర్హులైన ప్రతీ లబ్ధిదారుడికి పథకాలు అమలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తరువాత మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, రైతు భరోసా, ధాన్యానికి రూ.500 బోనస్, రుణమాఫీ అమలు చేశామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రతీ పేదవాడికి ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు ఇస్తామన్నారు. రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఇదివరకు రేషన్ బియ్యం డీలర్ల వద్దనే చేతులు మారేదని, ఇప్పుడు ప్రతీ లబ్ధిదారు బియ్యం తీసుకుని తింటున్నాడని చెప్పారు. నిరుద్యోగులకు ఇప్పటికే పెద్దఎత్తున నోటిఫికేషన్‌లు ఇచ్చి, ఉద్యోగ నియామకాలు చేపట్టామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని నోటిఫికేషన్‌లు వస్తాయన్నారు. అందరికీ నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రత్యేక దృష్టి సారించామన్నారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, నాయకులు వినోద్‌కుమార్, సీజే బెనహర్, షబ్బీర్‌అహ్మద్, రాములుయాదవ్, అవేజ్, అజ్మత్‌అలీ, అబ్దుల్‌హక్, సంజీవ్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, ప్రశాంత్, తిరుమల వెంకటేశ్ పాల్గొన్నారు.



స్టేడియాన్ని పరిశీలిస్తున్న డీవైఎస్‌వో

అవసరమైన సామగ్రి అందిస్తాం

- డీవైఎస్‌వో శ్రీనివాసులు

జడ్చర్ల, మే 22 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల పట్టణంలోని సిగ్నల్‌గడ్డ ప్రాంతంలో గల మినీ స్టేడియాన్ని డీవైఎస్‌వో శ్రీనివాసులు గురువారం పరిశీలించారు. స్థానిక కౌన్సిలర్ సతీష్, కోచ్ సునీల్‌తో కలిసి స్టేడియంలో వసతులను పర్యవేక్షించారు. మైదానికి తాగు నీటి కోసం మిషన్ భగీరథ పైపులైను ఏర్పాటు చేయించి, నల్లాలు బిగించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వాలీబాల్ క్రీడాకారులు ప్రాక్టీస్ చేయడానికి కావాల్సిన సామగ్రిని రెండు మూడు రోజుల్లో పంపుతామని వెల్లడించారు.

అనుమానమే పెనుభూతం

- భార్యను గొంతు నులిమి చంపిన భర్త
- పెళ్లయిన నెలకే ఘాతుకం
- మిస్టరీని ఛేదించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ లింగయ్య

మద్దూర్, మే 22 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలం ఎక్కమేడ్‌లో గత ఆదివారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన నవ వధువు కేసును పోలీసులు ఛేదించారు. భర్తే గొంతు నులిమి చంపినట్లు వెల్లడించారు. నారాయణపేట డీఎస్పీ లింగయ్య గురువారం మద్దూర్ పోలీస్ స్టేషన్‌లో సీఐ సైదులు, ఎస్‌ఐ విజయ్‌కుమార్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను తెలిపారు. ఎక్కమేడ్ గ్రామానికి చెందిన స్వామికి కోయిలకొండ మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన పూజ(20)తో గత ఏప్రిల్ 20న వివాహం జరిగింది. కొన్ని రోజులు ఇరువురు బాగానే ఉన్నారు. పది రోజుల క్రితం పూజ తల్లి గారి ఊరు మల్కాపూర్‌కు వెళ్లి, ఈ నెల 14న ఎక్కమేడ్ వచ్చింది. 18న రాత్రి నిద్రిస్తున్న క్రమంలో కడుపు నొప్పితో పూజ మృతి చెందని భర్త స్వామి కుటుంబ సభ్యులకు తెలిపాడు. స్వామి కుటుంబ సభ్యులు పూజ తండ్రి కుశలయ్యకు తెలిపారు. కుశలయ్య, కుటుంబ సభ్యులు ఎక్కమేడ్‌కు వచ్చి, పూజ మెడపై ఉన్న గాయాన్ని చూసి మరణంపై అనుమానం వ్యక్తం చేశారు. ఈ నెల 19న మద్దూర్ పోలీస్ స్టేషన్‌లో తండ్రి ఫిర్యాదు చేశాడు. కుశలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని సీఐ సైదులు, ఎస్‌ఐ విజయ్‌కుమార్ భర్త స్వామిని అదుపులో తీసుకొని విచారించారు. పుట్టినింటి నుంచి వచ్చాక భార్య పూజ తనకు దూరంగా ఉంటుందని స్వామి చెప్పాడన్నారు. 18న రాత్రి దగ్గరికి రానివ్వకపోవడం వెరొకరితో సంబంధం ఉన్నందునే తనను కలువనివ్వడం లేదని గుంతునులిమి చంపినట్లు నేరం ఒప్పుకున్నాడని చెప్పారు. స్వామిని గరువారం రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ తెలిపారు. కేసును ఛేధించిన సీఐ సైదులు, ఎస్‌ఐ విజయ్‌కుమార్‌ను డీఎస్పీ లింగయ్య అభినందించారు.

వేర్వేరు గ్రామాల్లో ఇద్దరి అదృశ్యం

- మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలో ఘటనలు

7

చిరుత దాడిలో దూడ మృతి

- కోయిలకొండ మండలంలోని ఇబ్రహీంనగర్‌లో ఘటన
- గ్రామంలో రాత్రి వేళ చిరుత సంచరిస్తుందని రైతుల ఆందోళన

7

మెడికల్ షాపు, ఐ క్లినిక్‌లలో చోరీ

- రూ.20 వేల నగదు దొంగతనం
- నారాయణపేటలో ఘటన

7

తేమ పేరుతో.. దగా

- నిబంధనల ప్రకారం ఉన్నా ధాన్యం కొనుగోలు చేయని నిర్వాహకులు
- డబ్బులు ఇచ్చిన వారికే మొదటి ప్రాధాన్యం
- వారాల తరబడి రైతుల పడిగాపులు
- ఎండ, వానకు ఇబ్బందులు



వర్షానికి తడవకుండా ధాన్యంపై కవర్లు కప్పుతున్న రైతులు

జడ్చర్ల, మే 22 (ఆంధ్రజ్యోతి): 'ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం తేమ శాతం 17 ఉండాలి. కానీ బాదేపల్లి పత్తి మార్కెట్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం నిర్వాహకులు 14 శాతం ఉంటేనే కొనుగోలు చేస్తామని అంటున్నారు' అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాంతో వారాల తరబడి పడిగాపులు కాస్తున్నామని వాపోతున్నారు. జడ్చర్ల మండలం బాదేపల్లి ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో గంగాపురం, కోడ్గల్ సెంటర్‌లలో, ఐకేపీ ఆధ్వర్యంలో మండలంలోని నసరుల్లాబాద్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. గంగాపురం కొనుగోలు కేంద్రాన్ని బాదేపల్లి పత్తి మార్కెట్‌లో నిర్వహిస్తున్నారు. మండల వ్యవసాయ శాఖలోని పోలేపల్లి, గొల్లపల్లి, ఖానాపూర్, గంగాపురం, జడ్చర్ల క్లస్టర్‌లలోని రైతులంతా బాదేపల్లి పత్తి మార్కెట్‌లోని కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తెస్తున్నారు. అయితే తేమ శాతం పేరుతో ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో 15 రోజులుగా పడిగాపులు కాస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం 17 శాతం తేమ ఉండాల్సి ఉండగా, అందుకు భిన్నంగా 14 శాతం తేమ ఉంటేనే కొంటామని ఇబ్బందులకు గురి చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. నిబంధనల ప్రకారం తేమ శాతంతో పాటు తాలు లేని ధాన్యానికి ఏఈవోలు టోకెన్లు జారీ చేస్తున్నారు. టోకెన్‌లు జారీ చేసినా తూకం వేయడానికి కనీసం మూడు రోజుల సమయం పడుతుందని రైతులు చెబుతున్నారు. తూకం చేయాలని అడిగితే నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని అంటున్నారు. మామూళ్లు ఇచ్చిన వారికే మొదటి ప్రాధాన్యం ఇచ్చి కొనుగోలు చేస్తున్నారని సివిల్ సప్లయ్ శాఖ జిల్లా మేనేజర్ రవినాయక్ ముందే ఓ రైతు చెప్పడం పరిస్థితిని తెలియజేస్తుంది. వర్షానికి తడవకుండా ధాన్యంపై కప్పేందుకు టార్పాలిన్ కవర్లు కూడా ఇవ్వడం లేదని రైతులు తెలిపారు. తూకం వేసేందుకు బస్తాల్లోకి ధాన్యం నింపిన చాట కూలీలు ముట్టి పేరుతో వేధింపులకు గురిచేస్తున్నారని అంటున్నారు.



నిబంధనల ప్రకారం తేమ ఉన్న ధాన్యం కొనడం లేదని సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ రవినాయక్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతులు

వారికే మొదటి ప్రాధాన్యం



ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మామూళ్లు ఇచ్చిన వారికే మొదటి ప్రాధాన్యం ఇస్తున్నారు. ధాన్యం బస్తాలకు అనుగుణంగా డబ్బులు ఇస్తేనే కొనుగోలు చేయడంతో పాటు తూకాలు చేస్తున్నారు. తెచ్చిన ధాన్యం విక్రయించడానికి 15 రోజులు పట్టింది.

- రాఘవరెడ్డి, గంగాపురం, రైతు

చాటకూలీలు దౌర్జన్యం చేస్తున్నారు



తూకం వేసేందుకు గోనె బస్తాల్లో ధాన్యం నింపిన చాటకూలీలు దౌర్జన్యం చేస్తున్నారు. 75 బస్తాల ధాన్యం సంచుల్లో నింపినందుకు దాదాపు 70 కిలోల ధాన్యం వదిలిపెట్టాలని అడుగుతున్నారు. ధాన్యం నింపడానికి, తూకం వేసినందుకు దడవాయికి, హమాలీకి 40 కిలోల బస్తాకు రూ.25.70 పైసలు చెల్లిస్తున్నాం. అయినా మళ్లీ ధాన్యం అడుగుతున్నారు.

- రాజు, కోల్‌బాయితండా, రైతు

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ సిక్తా పట్నాయక్
- ఎస్పీ యోగేష్ గౌతమ్‌తో కలిసి అధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): వర్షాల కారణంగా జిల్లాలో ఎలాంటి నష్టం జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. గురువారం కలెక్టర్ చాంబర్ హాల్‌లో ఎస్పీ యోగేష్ గౌతమ్‌తో కలిసి వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇతరత్రా అంశాలపై ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కల్వర్టులు వాటి పటిష్ఠతపై రిపోర్టు ఇవ్వాలన్నారు. ఎలాంటి నష్టం రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ శాఖకు సంబంధించి స్తంభాలు, వైర్లు తదితర వాటిపై సమీక్షించుకోవాలన్నారు. డీపీవో, గ్రామ పంచాయతీ పరిధిలో ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. మునిసిపల్ కమిషనర్లు పాత ఇళ్లను గుర్తించి ప్రత్యామ్నాయం చూపాలన్నారు. వ్యవసాయ శాఖ సంబంధిత పంటలపై నివేదికలు తయారు చేయాలన్నారు. ఎరువులు, యూరియా అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సీపీవో ఇరిగేషన్ వారు రిపోర్టు పంపాలన్నారు. ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ గత సంవత్సరం మద్దూరు, మరికల్ గ్రామాల్లో వర్షాలు అధికంగా నమోదు కావడం వల్ల వెంటనే స్పందించి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు తీసుకున్నామని తెలిపారు. అందరు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో, సీపీవో, ఇరిగేషన్, పీఆర్, ఆర్ అండ్‌బీ అధికారులు, డీఎంహెచ్‌వో, డీపీవో, విద్యుత్ శాఖ, డీఏవో, మునిసిపల్ కమిషనర్, ఏవో జయసుధ తదితరులు పాల్గొన్నారు.

గద్వాలలో విషాదఛాయలు

- కర్ణాటక రాష్ట్రంలో రోడ్డు ప్రమాదం
- మృతి చెందిన బ్యాంకు ఉద్యోగి భాస్కర్, భార్య, పిల్లలు
- కన్నీటి వీడ్కోలు పలికిన కాలనీవాసులు
- శోకసంద్రంలో కుటుంబ సభ్యులు, బంధువులు

7



అంత్యక్రియల్లో పాల్గొన్న కుటుంబ సభ్యులు, కాలనీవాసులు

ధాన్యం కొనుగోలులో జాప్యం

- వీపనగండ్ల, గోపాల్‌పేట మండలాల్లో రైతుల ఆందోళన
- రాస్తారోకోలతో నిలిచిపోయిన వాహనాలు

వీపనగండ్ల/ గోపాల్‌పేట, మే 22 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలులో జాప్యంపై రైతులు ఆందోళన బాట పట్టారు. వనపర్తి జిల్లాలోని వీపనగండ్ల, గోపాల్‌పేట మండలాల్లో రైతులు రాస్తారోకో నిర్వహించారు. ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని, లారీలు ఏర్పాటు చేసి ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని డిమాండ్ చేశారు. వనపర్తి జిల్లా, వీపనగండ్ల మండల పరిధిలోని కల్వరాల చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాలు వస్తే ధాన్యం తడిసిపోయి తీవ్రంగా నష్టపోతామన్నారు. రెండు నెలలు అవుతున్నా కొనుగోళ్లు పూర్తి కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాలు, తరుగు పేరుతో ధాన్యం కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించడం లేదన్నారు. ఇంకా మూడు వేల బస్తాల ధాన్యాన్ని మిల్లుకు పంపించాల్సి ఉందని, ఆ తరువాతనే ధాన్యం కొనుగోలు చేస్తామని కేంద్రం నిర్వాహకులు చెప్తున్నారన్నారు. కొనుగోళ్లు వేగవంతం చేయాలని, లారీల కొరత లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. రాస్తారోకో రెండు గంటల పాటు కొనసాగడంతో పోలీసులు అక్కడకు చేరుకొని రైతులతో మాట్లాడారు. రాస్తారోకో విరమించాలని కోరినా అంగీకరించలేదు. సమస్యను పరిష్కరిస్తామని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఫోన్‌లో హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు.

హైదరాబాద్ ప్రధాన రహదారిపై..

ధాన్యం కొనుగోలు చేయడం లేదని, సకాలంలో లారీలను పంపించడం లేదని ఆగ్రహించిన రైతులు గోపాల్‌పేట మండల కేంద్రంలోని హైదరాబాద్ ప్రధాన రహదారిపై రైతులు రాస్తారోకో చేపట్టారు. ఓ వైపు వర్షాలు పడి ధాన్యం తడిసిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సకాలంలో లారీలు పంపించకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆరోపించారు. రాస్తారోకో దాదాపు గంట పాటు కొనసాగడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న ఎస్‌ఐ నరేశ్‌కుమార్ అక్కడికి చేరుకుని రైతులకు నచ్చచెప్పేందుకు యత్నించారు. అయినా ఫలితం లేకపోవడంతో తహసీల్దార్ పాండు, డీటీ తిలక్ కుమార్‌రెడ్డి రైతులతో మాట్లాడారు. అనంతరం కొనుగోలు కేంద్రాలకు వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. అధికారులతో మాట్లాడి ధాన్యం కొనుగోలు వేగవంతం అయ్యేలా, లారీలు వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు. రైతుల ఆందోళనకు కాంగ్రెస్ నాయకులు సంఘీభావం తెలిపారు. రాస్తారోకోలో రైతులు శేఖర్, సుధాకర్, పార్వతి, నరేందర్, శ్రీను పాల్గొన్నారు.



గోపాల్‌పేటలో హైదరాబాద్ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

ప్రణాళిక ఉంటేనే ఫలితం

(5వ పేజీ తరువాయి)



జూరాల ప్రాజెక్టు(ఫైల్)

కొనుగోలు చేయడం, తక్కువ పెట్టుబడి, తక్కువ శ్రమ వంటి కారణాలతో ఎక్కువ మంది దానిని సాగు చేసేందుకే ఆసక్తి చూపుతున్నారు. దాంతో నీటి అవసరం పెరుగుతోంది. తద్వారా బోరుబావులు, కాలువల ద్వారా నీటి వినియోగం పెరిగింది. సాగునీటి ప్రణాళిక చేస్తున్నప్పుడు వ్యవసాయశాఖ ద్వారా వరికి ప్రత్యామ్నాయ పంటలపై ప్రజలకు అవగాహన కూడా పెంచాలి. కానీ ఆ విధంగా జరగడం లేదు. ప్రభుత్వం ఆదేశిస్తే తూతూమంత్రంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు తప్ప.. కచ్చితమైన పరిశీలన, పర్యవేక్షణ ఉండటం లేదు. ప్రభుత్వం కూడా ఆరుతడి పంటల ప్రోత్సాహానికి మార్కెటింగ్ సౌకర్యం, గిట్టుబాటు ధర, సబ్సిడీలపై దృష్టి సారించాలి. అలాగే ఈ నీటి వనరుల వినియోగం ఏ స్థాయిలో ఉందంటే వానాకాలంలో పైపైనే కనిపిస్తున్న నీరు.. యాసంగి వచ్చేసరికి భూగర్భ జలాలు పాతాళానికి పడిపోతున్నాయి. బోరుబావుల ద్వారా కూడా నీటి వినియోగం అధికంగా జరుగుతుండటమే ఇందుకు కారణం. దీని వల్ల సాగునీటితోపాటు తాగునీటి సమస్యలు కూడా ఉత్పన్నం అవుతున్నాయి. దాంతో ప్రత్యామ్నాయ నీటి నిల్వ వనరులను నిర్మించడం, ఉన్న రిజర్వాయర్లను పూర్తిస్థాయిలో నింపడం, కచ్చితమైన ప్రణాళికను అనుసరించడం ద్వారా ఈ కష్టాలను అధిగమించే అవకాశం ఉంది. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టుకు 8,953 క్యూసెక్కుల వరద వస్తున్న నేపథ్యంలో ఇప్పటి నుంచి ప్రణాళికలను అనుసరించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

చిన్నచింతకుంటలో ఘనంగా తిరంగా ర్యాలీ



చిన్నచింతకుంటలో తిరంగా ర్యాలీలో పాల్గొన్న ప్రజలు

చిన్నచింతకుంట, మే 22 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌కు సంఘీభావంగా బాలగంగాధర్ తిలక్ యువజన సంఘం ఆధ్వర్యంలో గురువారం మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండల కేంద్రంలో జాతీయ జెండాలతో తిరంగా ర్యాలీ చేపట్టారు. గురువారం సాయంత్రం ఎస్సీ కాలనీ నుంచి స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు చేపట్టిన ర్యాలీలో పార్టీలకు, కులమతాలకు అతీతంగా, యువకులు, పెద్దలు పాల్గొన్నారు. జాతీయ జెండాలను చేతబట్టి, భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతకుమార్ హాజరై ర్యాలీలో పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి

- విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ లింగయ్య



ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తున్న లింగయ్య

వెల్దండ, మే 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల శాతం పెంచి, మెరుగైన విద్యను అందించేందుకు కృషిచేయాలని విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ లింగయ్య ఉపాధ్యాయులకు సూచించారు. నాగర్‌కర్నూల్ జిల్లా, వెల్దండ మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణ కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాన్ని పెంచేందుకు విద్యాశాఖ చేపడుతున్న కార్యక్రమాలలో భాగంగా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ పాఠశాలలో ఇంగ్లీషు మీడియంలో బోధించాలని, తెలుగులో మౌళిక భాషాభివృద్ధికి, గణితంలో చతుర్విధ ప్రక్రియలను సాధించేందుకు డిజిటల్ పద్ధతిలో బోధించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో చంద్రుడు, ఎంఆర్‌సీలు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

- నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు
- ఈ నెల 26న డిప్యూటీ సీఎం చేతుల మీదుగా శంకుస్థాపన

కల్వకుర్తి, మే 22 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను మంజూరు చేసిందని చెప్పారు. తలకొండపల్లి మండలం, ఖానాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఇంటిగ్రేటెడ్ స్కూల్, సబ్ స్టేషన్ నిర్మాణాలకు గురువారం ఆయన స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 26న ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క రానున్నారని, ఇంటిగ్రేటెడ్ స్కూల్‌తో పాటు సబ్‌స్టేషన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యాభివృద్ధితో పాటు రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రేషన్‌షాపుల్లో పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తోందని చెప్పారు. ప్రజా సంక్షేమం, అభివృద్దే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు.



ఇంటిగ్రేటెడ్ స్కూల్ స్థలం కోసం మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు

- సోషల్ డెమోక్రటిక్ ఫోరం జాతీయ అధ్యక్షుడు జనార్దన్‌గౌడ్

కొత్తకోట, మే 22 (ఆంధ్రజ్యోతి): జనాభా దామాషా ప్రకారం చట్టసభలు, రాజకీయ పార్టీల్లో రిజర్వేషన్లు కల్పించినప్పుడే బీసీలకు న్యాయం జరుగుతుందని సోషల్ డెమోక్రటిక్ ఫోరం జాతీయ అధ్యక్షుడు జనార్దన్‌గౌడ్ అన్నారు. వెనుకబడిన తరగతుల సమాఖ్య (బీసీఎఫ్) ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా, కొత్తకోట పట్టణంలోని బీపీఆర్ గార్డెన్‌లో గురువారం నిర్వహించిన చైతన్య సదస్సులో ఆయన మాట్లాడారు. అధిపత్య కులాల పాలనలో బీసీ కులాలకు న్యాయం జరగడం లేదన్నారు. ప్రతీ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో రెండు సీట్లు బీసీలకు ఇవ్వాలని కాంగ్రెస్ తీర్మానం చేసింది కానీ అమలు చేయడం లేదని విమర్శించారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రతీ సంవత్సరం బీసీలకు 20 వేల కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని ప్రకటించినా, ఎక్కడా ఖర్చు పెట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభా ప్రతిపాదికన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ కేటాయించి, ప్రణాళికాబద్ధంగా ఖర్చు చేస్తేనే బీసీలు కొంత మేరకైనా బాగుపడే అవకాశం ఉందన్నారు. బడ్జెట్‌లో వాటా దక్కాలంటే బహుజన రాజ్యాధికారం రావాలని, అందుకోసం బీసీ కులాలు చైతన్యం కావాలని పిలుపునిచ్చారు. సదస్సుకు బీసీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చెన్నరాములు అధ్యక్షత వహించారు. నాయకులు డాక్టర్ స్వరూపారాణి, ప్రొఫెసర్లు విటోభా, రాంషాపాడ్, శాంతకుమార్, రామన్‌గౌడ్, రాంమోహన్, రమేశ్, జిల్లా నాయకులు రాములు యాదవ్, వెంకటేశ్, అశోక్ నాయుడు, గంగాధర్ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సోషల్ డెమోక్రటిక్ ఫోరం జాతీయ అధ్యక్షుడు జనార్దన్‌గౌడ్

సీడ్ కంపెనీలపై చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్, డీఏవోకు ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్ నాయకులు
- చర్యలు తీసుకోకపోతే పెద్దఎత్తున ఉద్యమిస్తాం

గద్వాల, మే 22(ఆంధ్రజ్యోతి): రైతులను మోసం చేస్తున్న సీడ్ కంపెనీలపై వెంటనే చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కురువ విజయ్‌కుమార్, సీడ్ పత్తి రైతులు కలెక్టర్, జిల్లా వ్యవసాయ అధికారులకు గురువారం ఫిర్యాదు చేశారు. రైతులను మోసం చేసి వారి కుటుంబాలను రోడ్డున పడేస్తున్నాయని, దీనివల్ల రైతులు ఆత్మహత్య చేసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. ఈసందర్భంగా డాక్టర్ కురువ విజయ్ కుమార్ మాట్లాడుతూ సీడ్ కంపెనీలు నేరుగా రైతులకు సీడ్ ఇవ్వకుండా సబ్ ఆర్గనైజర్లను దళారులుగా నియమించుకొని దగా చేస్తున్నాయని అన్నారు. రైతులు పండించిన సీడ్ పంటను పాస్ అయినప్పటికీ సీడ్ ఫెయిల్ అయిందని డబ్బులు ఇవ్వకుండా ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. సీడ్ పాస్ అయ్యిందా లేదా అనే విషయం ప్రభుత్వం వ్యవసాయ శాఖ ల్యాబ్‌లో నిర్ధారణ చేయాలని డిమాండ్ చేశారు. కానీ సీడ్ కంపెనీలు స్వయంగా పెట్టుకొన్న జీవోటీ నిబంధనల ప్రకారం నిర్ధారణ చేసి పంట ఫెయిల్ అయ్యిందని రైతులను మోసం చేస్తున్నాయని చెప్పారు. ఫెయిల్ అయిన సీడ్‌ను రైతులు ప్రయివేట్ ల్యాబ్‌లో పరీక్ష చేయిస్తే వందశాతం పాస్ అయినట్లు నిర్ధారణ అయ్యిందన్నారు. నీలిపల్లికి చెందిన చిన్ననర్సింహులు, డోలు క్రిష్ణల సీడ్ ఫెయిల్ అయ్యిందని సీడ్ ఆర్గనైజర్లు చెప్పారని అదే ప్రయివేటు ల్యాబ్‌లో పాస్ అయినట్లు రిపోర్టు వచ్చిందని వివరించారు. దీనిని బట్టి చూస్తే 20ఏళ్లుగా సీడ్ ఆర్గనైజర్లు రైతులను మోసం చేస్తూ రూ.కోట్లను కొల్లగొట్టారని ఆరోపించారు.

ప్రయివేట్ ల్యాబ్ రిపోర్టులను అందిస్తున్నట్లు కలెక్టర్‌కు తెలిపారు. లోతుగా విచారణ చేసి కంపెనీలు, ఆర్గనైజర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రైతులు పాల్గొన్నారు.



కలెక్టర్ ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కురువ విజయ్ కుమార్

ఆరు ప్రభుత్వ ఉద్యోగాలు

- చిట్యాల యువకుడి ప్రతిభ



దయాకర్‌గౌడ్

మక్తల్ రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగం ఒకటి తెచ్చుకోవడమే కష్టసాధ్యంగా ఉన్న ఈ రోజుల్లో నారాయణపేట జిల్లా, మక్తల్ మండలం చిట్యాల గ్రామానికి చెందిన యువకుడు ఆరు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. గ్రామానికి చెందిన మారుతిగౌడ్ కుమారుడు దయాకర్‌గౌడ్ తాజాగా విడుదలైన గ్రూపు-2 ఫలితాల్లో ప్రభుత్వ ఉద్యోగం సంపాదించాడు. అంతకు ముందే ఆయనకు ఫారెస్టు బీట్ ఆఫీసర్, పంచాయతీ కార్యదర్శి, గ్రూప్-4 జూనియర్ అసిస్టెంట్, గ్రూప్-4 రెవెన్యూ, గ్రూప్-3 ఉద్యోగాలు తెచ్చుకున్నాడు. తాజాగా గ్రూప్-2లో సత్తా చాటి విజయం సాధించిన అతడికి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు, స్నేహితులు అభినందనలు తెలిపారు.

పాఠశాల నిర్మాణానికి భూమి పరిశీలన



ఎండీకి స్వాగతం పలుకుతున్న అధికారులు, కాంట్రాక్టర్

గద్వాల, మే 22 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, కేటీ దొడ్డి మండల కేంద్రంలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి తెలంగాణ విద్య, మౌలిక సదుపాయాల సంస్థ ఎండీ గణపతి రెడ్డి భూమిని పరిశీలించారు. అందుకోసం గద్వాలకు వచ్చిన ఆయనకు స్థానిక అధికారులు సాదర స్వాగతం పలికారు. అనంతరం కేటీదొడ్డి మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల పక్కనున్న స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలో అన్ని హంగులతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలను నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఈడబ్ల్యూడీసీ ఎస్ఈ మహ్మద్ షఫీ, ఈఈ రామచంద్రుడు, డీఈ బాల్‌రెడ్డి, ఏఈలు మోహన్‌రెడ్డి, అంజాద్ అలీతో పాటు కాంట్రాక్టర్ లత్తీపురం రాంరెడ్డి ఉన్నారు.

బ్యాంకును మోసం చేసిన మహిళపై కేసు నమోదు

పాన్‌గల్, మే 22 (ఆంధ్రజ్యోతి): బ్యాంకును మోసం చేసిన ఘటనలో మహిళపై కేసు నమోదైన సంఘటన గురువారం వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలంలో చోటు చేసుకున్నది. ఎస్‌ఐ శ్రీనివాస్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రం పాన్‌గల్‌కు చెందిన ముండ్లపాటి అంజనమ్మ అనే మహిళ పాన్‌గల్ ఎస్బీఐ బ్రాంచిలో 14-02-2024 రోజున జేసీబీ వాహనం కొనుగోలు పేరుతో 29.40 లక్షలు రుణం తీసుకున్నది. రుణం తీసుకున్న మహిళ కొద్ది నెలలు మాత్రమే ఈఎంఐలు చెల్లించింది. మిగతా కంతులు చెల్లించలేదు. ఈఎంఐ చెల్లించకుండా జేసీబీ వాహనాన్ని బ్యాంకు రికవరీ అధికారులకు అప్పగించకుండా బ్యాంకును మోసం చేశారని ఎస్‌బీఐ మేనేజర్ నాగేష్ కుమార్ గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సాఫ్ట్‌బాల్ జాతీయ జట్టుకు మిడ్జిల్ మండల వాసి



జక్క కిరణ్‌కుమార్

మిడ్జిల్, మే 22 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, మిడ్జిల్ మండలం, రాణిపేట గ్రామానికి చెందిన జక్క బీరయ్య కుమారుడు జక్క కిరణ్‌కుమార్ సాఫ్ట్‌బాల్ జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు. ఎంపిక ధ్రువపత్రాన్ని గురువారం మీడియాకు అందించారు. ప్రస్తుతం అతడు హైదరాబాద్‌లోని ఏవీ కళాశాలలో ఆర్గానిక్ కెమిస్ట్రీలో పీజీ చేస్తున్నాడు.

మహబూబ్‌నగర్ ఏఎస్పీ రాములు బదిలీ



అడిషినల్ ఎస్పీ అందె రాములు

మహబూబ్‌నగర్, మే 22 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ అడిషినల్ ఎస్పీ అందె రాములు బదిలీ అయ్యారు. గురువారం ప్రభుత్వ సీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈయనను హైదరాబాద్ సిటీ అడిషినల్ డీసీపీ ట్రాఫిక్‌కు బదిలీ చేశారు. కాగా ఈయన పాలమూరులో సుదీర్ఘ కాలం పాటు పనిచేశారు. 2022 మార్చి 7 నుంచి ఆయన ఏఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. ఆయన స్థానంలో మహబూబ్‌నగర్ ఏఎస్పీగా ఇంకా ఎవరిని నియమించలేదు. రెండు, మూడు రోజుల్లో కొత్త అధికారి నియా మకం అయ్యే అవకాశం ఉంది.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలి



జిల్లా కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ పోస్టర్‌ను విడుదల చేస్తున్న జేవీపీఎస్ నాయకులు

నారాయణపేట టౌన్/మక్తల్, మే 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పసుపుల గ్రామంలో ఈనెల 25న నిర్వహించనున్న అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జోగినీ వ్యతిరేక పోరాట సమితి (జేవీపీఎస్) జిల్లా కన్వీనర్ హాజమ్మ కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆమె విగ్రహావిష్కరణ కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రజా కవి జయరాజు, మక్తల్ ఎమ్మెల్యే డా.వాకిటి శ్రీహరి, ప్రజా సంఘాల నాయకులు హాజరవుతారని, అనంతరం బహిరంగ సభను విజయవంతం చేయాలన్నా రు. అన్ని మండలాల అంబేడ్కర్ సంఘం నాయకులు హాజరై సభను విజయవంతం చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు బలరాం, బీఎస్పీ జిల్లా నాయకుడు గౌతమ్, దళిత ప్రజా సంఘాల నాయకులు కృష్ణ, నర్సింలు, నారాయణ, అన్నమ్మ, రూపిక, ఆశమ్మ, లక్ష్మి తదితరులున్నారు.

అదేవిధంగా, మక్తల్ పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో అంబేడ్కర్ సంఘం నాయకులు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో యువజన సంఘం పసుపుల గ్రామ అధ్యక్షుడు చిన్న నర్సిములు, ప్రధాన కార్యదర్శి నర్సిములు, అంబేడ్కర్ యువజన సంఘం మక్తల్ అధ్యక్షుడు పృథ్వీరాజ్, కేఎన్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు నాగేష్, వెంకటపతి రాజు, శ్రవణ్‌కుమార్ తదితరులున్నారు.

పచ్చిరొట్టతో నేల సారవంతం

- శాస్త్రవేత్తలు డాక్టర్ రాజారెడ్డి, డాక్టర్ శ్రీరామ్



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

తెలకపల్లి : రైతులు వ్యవసాయ సాగులో రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా పచ్చిరొట్టతో నేల సారవంతంతో పాటు పంటకు మేలు జరిగి, అధిక దిగుబడులు వస్తాయని పాలెం వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ రాజారెడ్డి, డాక్టర్ శ్రీరామ్‌లు అన్నారు. గురువారం మండల పరిధిలోని లక్నారం గ్రామంలో రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు అనే కార్యక్రమంలో భాగంగా వారు పాల్గొని మాట్లాడారు. నేలను బట్టి పంట మార్పిడి పద్ధతి ద్వారా తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించే పద్ధతులను రైతులకు సూచించారు. అనంతరం రైతు వేదిక వద్ద మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నర్మద, సింగిల్ విండో డైరెక్టర్లు వి.రాజమహేందర్‌రెడ్డి, ఊషన్న, వ్యవసాయ విస్తరణాధికారి శ్రావణి, రైతులు పాల్గొన్నారు.

పంట మార్పిడితో అధిక దిగుబడి

తిమ్మాజిపేట, మే 22 (ఆంధ్రజ్యోతి) : పంట మార్పిడితో అధిక దిగుబడులు వస్తాయని పాలెం ప్రాతీయ వ్యవసాయం పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ సుధాకర్, డాక్టర్ శశిభూషణ్, ఎస్.రమేష్‌లు రైతులకు సూచించారు. తిమ్మాజిపేట మండల పరిధిలోని మారేపల్లి రైతు వేదికలో గురువారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సదస్సునుద్దేశించి శాస్త్రవేత్తలు మాట్లాడుతూ అవసరం మేరకు రసాయన ఎరువులు వినియోగించాలని రైతులు అధిక దిగుబడుల కోసం తక్కువ యూరియా వాడాలని, పెట్టుబడి ఖర్చు తగ్గుతుందన్నారు. సేంద్రియ ఎరువులను వాడాలని, సస్యరక్షణ చర్యలతో తెగుళ్లను నివారించవచ్చన్నారు. గ్రామాల్లో మొక్కలు అధికంగా నాటాలని, సాగునీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు పూర్ణచందర్‌రెడ్డి, వ్యవసాయ విస్తరణాధికారి సాయిరాం, రైతులు పాల్గొన్నారు.

టీజీ ఆర్‌జేసీలో ఊర్కొండ విద్యార్థిని ప్రతిభ

- రాష్ట్ర స్థాయి 11వ ర్యాంకు సాధించిన రిషిక



ఊర్కొండ వెంకట బాల్ రామయ్య పాఠశాలలో విద్యార్థినీ చిదిరే రిషికను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఊర్కొండ, మే 22 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, ఊర్కొండ మండల కేంద్రానికి సంబంధించిన విద్యార్థిని చిదిరే రిషిక ప్రతిభ కనబరిచింది. స్థానిక వెంకట బాలరామయ్య పాఠశాలలో పదవ తరగతి చదివిన ఆమె టీజీ ఆర్‌జేసీ సెట్‌లో రాష్ట్ర స్థాయి 11వ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆమెను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ తిరుపతయ్య, కరస్పాండెంట్ బాల్ రాజు, ప్రిన్సిపాల్ జార్జ్ జోసెఫ్, వైస్ ప్రిన్సిపాల్ పెరుమాండ్ల రామ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చిరుత దాడిలో దూడ మృతి

కోయిలకొండ, మే 22 (ఆంధ్రజ్యోతి) : పశువుల పాకలో కట్టేసి ఉన్న ఆవు దూడపై చిరుత పులి దాడి చేసి చంపేసింది. మహబూబ్‌నగర్ జిల్లా, కోయిలకొండ మండలంలోని ఇబ్రహీంనగర్‌లో బుధవారం రాత్రి ఈ సంఘటన జరిగింది. గ్రామానికి చెందిన రైతు ఆనంద్‌గౌడ్ బుధవారం రాత్రి కుక్కల గుట్ట వద్ద తమ పొలంలోని పశువుల పాకలో దూడను కట్టేసి ఇంటికి వెళ్లిపోయాడు. అర్ధరాత్రి తర్వాత పాకలో ప్రవేశించిన చిరుత పులి కట్టేసి ఉన్న ఆవుదూడపై దాడి చేసింది. గురువారం ఉదయం రైతు పొలానికి వెళ్లి చూడగా దూడ చనిపోయి ఉంది. కొన్ని రోజులుగా గ్రామంలో రాత్రి వేళ చిరుత పులి సంచరిస్తోందని స్థానిక రైతులు తెలిపారు. మేకలు, దూడలు, కుక్కలను ఎత్తుకెళ్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అటవీశాఖ అధికారులు స్పందించి చిరుతను బంధించాలని కోరుతున్నారు.

మెడికల్ షాపు, ఐ క్లినిక్‌లలో చోరీ

» రూ. 20 వేల నగదు దొంగతనం



చోరీకి గురైన క్లినిక్

నారాయణపేట, మే 22 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా కేంద్రంలోని సమీర్ మెడికల్ హాల్, కనిగిరి ఐ క్లినిక్‌లలో చోరీ జరిగింది. గురువారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి రెండు షట్టర్ల తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. గురువారం ఉదయం వెళ్లిన యజమానులకు రెండు షట్టర్ల తాళాలు విరిగిపోయి ఉండటం కనిపించింది. లోనికి వెళ్లి పరిశీలించగా సామగ్రి మొత్తం చిందరవందరగా పడి ఉంది. రెండు షట్టర్లలోని కౌంటర్‌లలో దాదాపు రూ. 20 వేలు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించారు. ఓ వ్యక్తి రాడ్‌తో షట్టర్ల తాళాలు పగులగొట్టి లోనికి వెళ్లడం, చోరీ చేసి పరారయిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అయినట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వేర్వేరు గ్రామాల్లో ఇద్దరి అదృశ్యం

జడ్చర్ల, మే 22 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మండలంలోని వేర్వేరు గ్రామాల్లో ఇద్దరు అదృశ్యమయ్యారు. సీఐ కమలాకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జడ్చర్ల మునిసిపాలిటీలోని శాంతినగర్ ప్రాంతానికి చెందిన అన్వేష్‌కుమార్, గాయత్రి దంపతులకు ఏడాదిన్నర వయసున్న కుమార్తె రిహన్షిక ఉంది. ఈ నెల 15న సాయంత్రం 6 గంటల సమయంలో గాయత్రి తన కుమార్తెతో కలిసి ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. రాత్రయినా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం భర్త అన్వేశ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడ్తున్నట్లు సీఐ తెలిపారు.

● ఉదండాపూర్ గ్రామానికి చెందిన రామచందయ్య గత సంవత్సరం నుంచి వరంగల్ జిల్లా, పరకాలలో వెంకటయ్య అనే వ్యక్తి వద్ద గొర్రెల సంరక్షకుడిగా పనిచేస్తున్నాడు. ఈ నెల 17న ఉదండాపూర్‌కు వచ్చిన ఆయన బుధవారం రాత్రి వరంగల్‌కు వెళ్లేందుకు జడ్చర్ల కొత్త బస్టాండుకు చేరుకున్నాడు. రాత్రి 10 గంటల సమయంలో కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా, బస్సు కోసం వేచి ఉన్నట్లు తెలిపాడు. గురువారం ఆరు 6 గంటలకు మరోసారి ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో వెంకటయ్యకు ఫోన్ చేయగా, అక్కడికి రాలేదని చెప్పాడు. ఈ మేరకు రామచంద్రయ్య కుమారుడు శివ ఫిర్యాదు చేయడంతో, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి

శ్రీరంగాపూర్, మే 22 (ఆంధ్రజ్యోతి): పొట్టకూటి కోసం చేపల వేటకు వెళ్లిన ఓ మత్స్యకారుడు భీమా కాలువలో పడి మృతి చెందిన సంఘటన గురువారం వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్‌లో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన బొల్లెద్దుల ఆంజనేయులు గురువారం ఉదయం గ్రామ సమీపంలో ఉండే భీమా కాలువలో చేపల వేటకు వెళ్లాడు. ఆ సమయంలోనే ఫిట్స్ రావడంతో కాలువలో పడి మృతి చెందాడు. ఇతని భార్య కూడా కొన్నేళ్ల క్రితం మృతి చెందడంతో కుటుంబంలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. ఈయనకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని తండ్రి బొల్లెద్దుల బుచ్చన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నిరుపయోగంగా వైకుంఠ ధామాలు

» గద్వాల జిల్లాలో రూ. 28 కోట్లతో నిర్మాణం
» వసతుల కొరతతో అంత్యక్రియలకు అవస్థలు
» మందుబాబులకు అడ్డాలు, బీటలు వారుతున్న కట్టడాలు



చెన్నిపాడు గ్రామంలో మందుబాబులకు అడ్డాగా మారిన వైకుంఠధామం



మారమునగాల-1 గ్రామంలో అంతిమ సంస్కారాల కోసం కృష్ణానది పరివాహక ప్రాంతానికి వెళ్తున్న గ్రామస్థులు (ఫైల్)

అలంపూర్ చౌరస్తా, మే 22 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లాలో, గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన వైకుంఠధామాలు నిరుపయోగంగా మారుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా వీటిని నిర్మించాయి. మొదట రూ. 10 లక్షలతో నిర్మించాలనుకున్నా, నీరు, విద్యుత్, ఇతర వసతుల కల్పనకు రూ. 2.6 లక్షలకు పెంచారు. ఒక్కో గ్రామంలో మొత్తం రూ.12.60లక్షలతో వైకుంఠధామాలను నిర్మించారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో మొత్తం 255 గ్రామ పంచాయతీలు ఉండగా, ఒకటి, రెండు మినహా అన్ని గ్రామాల్లో దాదాపు రూ. 28 కోట్ల వ్యయంతో వైకుంఠ ధామాలను నిర్మించారు. వాటిలో పంచాయతీరాజ్ శాఖ ద్వారా 219, మిగతావి డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిర్మించారు. వీటి నిర్మాణం పూర్తయి దాదాపు ఐదేళ్లు కావస్తున్నా, చాలా గ్రామాల్లో నేటికీ వినియోగంలోకి రాలేదు. నాణ్యతలేమితో కట్టడాలకు బీటలు వారుతున్నాయి. కొన్ని చోట్ల మందుబాబులకు అడ్డాలుగా మారాయి.

కనీస వసతులు లేక అవస్థలు

ప్రతీ వైకుంఠధామంలో రెండు దహన వాటికలు, రెండు స్నానపు గదులు, రెండు మరుగు దొడ్లు, చితభస్మాలు, అంత్యక్రియలకు అవసరమైన సామాగ్రిని ఉంచుకునేందుకు ఒక గదితో పాటు విశ్రాంతి కోసం మరో గదిని ఏర్పాటు చేయాల్సి ఉంది. తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. అయితే చాలా చోట్ల నిర్మాణాలు కట్టి వదిలేశారు కానీ, విద్యుత్, నీటి సౌకర్యాలు కల్పించలేదు. ఊరికి దగ్గరగా నిర్మించిన వైకుంఠధామాలకు మాత్రం మిషన్‌భగీరథ ద్వారా నల్లా కనెక్షన్ ఇచ్చారు.దూరంగా ఉన్న చోట బోర్లు వేయాల్సి ఉంది. కానీ గ్రామ పంచాయతీల్లో నిధులు లేక అప్పటి సర్పంచులు ముందుకు రాలేదు. కొన్ని చోట్ల బోర్లు వేసినా విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవడం, మోటారు అమర్చకపోవడంతో వృథాగా మిగిలాయి. విద్యుత్ కనెక్షన్ కోసం డీడీలు తీయాల్సి ఉన్నా సర్పంచులు ఆసక్తి చూపలేదు. దీంతో చాలా చోట్ల కట్టడాలు వినియోగంలోకి రాకముందే శిథిలావస్థకు చేరుతున్నాయి. వినియోగంలోకి రాని వైకుంఠధామాలు ఆకతాయిలకు అడ్డాలుగా మారాయి. మానవపాడు మండలం, చిన్నపోతులపాడులోని వైకుంఠధామంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు కొందరు పేకాట ఆడుతున్నారు. మరికొన్ని చోట్ల మందుబాబులు తిష్టవేస్తున్నారు.

అనువుగాని చోట నిర్మాణాలు

జిల్లాలోని పలు గ్రామాల్లో నిర్మించిన వైకుంఠధామాలు నేటికీ వినియోగంలోకి రాలేదు. సౌకర్యాలులేమి ఒకటైతే, అంత్యక్రియలకు అనువుకాని ప్రాంతాలు కావడం మరో కారణం. అలాగే వాస్తుదోషాల పేరుతో కొన్ని చోట్ల వినియోగంలోకి రాలేదు. కొన్ని చోట్ల సరైన రోడ్లు లేకపోవడం కూడా సమస్యగా మారింది. దీంతో చాలా గ్రామాల్లో ప్రజలు పాత శ్మశాన వాటికల్లోనే అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. అలాగే చాలా కులాల్లో మృతదేహాలను ఖననం చేయడం ఆనవాయితీగా వస్తోంది. దీంతో వారు వైకుంఠ ధామాల్లో దహన సంస్కారాలు చేసేందుకు ముందుకు రావడం లేదు.

5 ఎకరాల్లో నిర్మించినా...

మానవపాడు మండల పరిధిలోని చెన్నిపాడులో పూర్వం ఊరి పక్కన కొంత స్థలాన్ని శ్మశాన వాటికకు కేటాయించుకున్నారు. గ్రామంలో ఎవరు చనిపోయినా అక్కడే అంతిమ సంస్కారాలు నిర్వహించేవారు. కాలక్రమంలో శ్మశానానికి నలువైపులా ప్రజలు ఇళ్లు నిర్మించుకోవడంతో అది ప్రస్తుతం గ్రామం మధ్యలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వం ఊరికి దూరంగా 5 ఎకరాల ప్రభుత్వ స్థలంలో వైకుంఠధామాన్ని నిర్మించారు. పంచాయతీ నిధులతో బోరు వేసినా నీరు పడలేదు. పైగా అది కొండలు, బండలు ఉన్న ప్రాంతం కావడంతో ఖననానికి గుంతలు తీయడం సాధ్యం కావడం లేదు. పైగా అది నైరుతి దిశన ఉండటంతో అంతిమసంస్కరాలు చేయకుడదని ప్రజలు భావిస్తున్నారు. దీంతో నేటికీ నిరుపయోగంగానే ఉంది. దీంతో అది మందుబాబులకు, అసాంఘిక కార్యకాలపాలకు అడ్డాగా మారింది. అక్కడ నిర్మించిన గదుల తలుపులు, కిటికీలు ధ్వంసం అయ్యాయి. గోడలు బీటలు వారుతున్నాయి.

ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషనల్ హబ్ నిర్మాణానికి స్థల పరిశీలన



ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ హబ్ నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

వనపర్తి టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ హబ్ నిర్మాణానికి టీజీఈడబ్ల్యూఐడీసీ ఎండీ గణపతి రెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి స్థల పరిశీలన చేశారు. 200 కోట్ల రూపాయలతో వనపర్తి నియోజకవర్గంలోని శ్రీనివాసపురం దగ్గర నిర్మించే ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషనల్ హబ్ నిర్మాణానికి గురువారం రాష్ట్ర ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ గణపతి రెడ్డితో కలిసి ఎమ్మెల్యే మేఘారెడ్డి స్థల పరిశీలన చేశారు. మార్చి 2వ తేదీన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి 200 కోట్ల రూపాయలతో ఎడ్యుకేషనల్ హబ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారని ఈ క్రమంలోనే సంబంధిత అధికారులతో స్థల పరిశీలన చేపట్టినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. త్వరలోనే ఎడ్యుకేషనల్ హబ్ నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ చేపడతామని ఎండీ గణపతి రెడ్డి తెలిపారు. అధికారులు ఎస్ఈ షఫీమియా, ఈఈ రామచంద్ర, డీఈ వెంకట్‌రెడ్డి, డీఈఈ ప్రతాప్, ఏఈలు, వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వనపర్తి పట్టణ అధ్యక్షులు చీర్ల చందర్, మునిసిపల్ మాజీ చైర్మన్ పుట్టపాకుల మహేష్, మాజీ వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణయ్య, జడ్పీటీసీ మాజీ సభ్యుడు గొల్ల వెంకటయ్య, మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త లక్కాకుల సతీష్, మాజీ కౌన్సిలర్లు రెవెన్యూ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదు



ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్న వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవ రావు

పెబ్బేరు, మే 22(ఆంధ్రజ్యోతి): వాహనదారులు ప్రభుత్వ నిబంధనలు ఉపేక్షిస్తే సహించేది లేదని వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వాసు దేవ రావు హెచ్చరించారు. గురువారం జాతీయ రహదారిపై వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిపై వాహనాల తనిఖీలు చేపడుతు న్న క్రమంలో పామాపురం చెందిన మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తెలిపారు. రోడ్డు టాక్సీ, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ లేని రెండు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేశామన్నారు. ప్ర తీ వాహనదారుడు రోడ్డు రవాణ సంస్థ నిబం ధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించా రు. రోడ్డుపైకి వచ్చే వాహనాలు రోడ్డు ట్యాక్సీ, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్, డ్రైవింగ్ లైసెన్స్, సీట్ బెల్ట్ తదితర నియమాలు పాటించాలని తెలిపారు.

జడ్చర్ల పట్టణవాసికి ‘జీవ వైవిధ్య పరిరక్షణ అవార్డు’



రాష్ట్ర అటవీశాఖ ముఖ్యకార్యదర్శి డాక్టర్ సువర్ణ చేతుల మీదుగా జీవ వైవిధ్య పరిరక్షణ అవార్డును అందుకుంటున్న రమాదేవి

జడ్చర్ల, మే 22 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల పట్టణ వాసి రమాదేవికి జీవవైవిధ్య పరిరక్షణ అవార్డు లభించింది. ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో చదువుకున్న ఆమె గత ఏడాది వరకు అదే కళాశాలలో పరిశోధక విద్యార్థిగా ఉన్నారు. కళాశాలలోని బొటానికల్ గార్డెన్‌లో మొక్కలు నాటుతూ, అడవులలో పరిశోధనలు చేస్తూ, వివిధ రకాల విత్తనాలు సేకరించడంతో పాటు, సర్పాల రక్షణలో ముఖ్య పాత్ర పోషించినందుకు ఆమె ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం సందర్భంగా గురువారం హైదరాబాద్‌లోని బిర్లా మ్యూజియంలోని భాస్కర్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో అటవీశాఖ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి డాక్టర్ సువర్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాళీచరణ్‌కతర్దేల చేతుల మీదుగా ఆమె పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా జడ్చర్ల ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుకన్య, బొటానికల్ గార్డెన్ కోఆర్డినేటర్ డాక్టర్ సదాశివయ్య, అధ్యాపకులు ఆమెను అభినందించారు.

మొబైల్ ఫోన్ల రికవరీ, అప్పగింత

» ఖిల్లాఘణపురం ఎస్ఐ సురేశ్ గౌడ్



రికవరీ చేసిన సెల్‌ఫోన్లను ఖిల్లాఘణపురం పోలీస్ స్టేషన్లో బాధితులకు అప్పగిస్తున్న ఎస్ఐ సురేశ్‌గౌడ్

ఖిల్లాఘణపురం, మే 22 (ఆంధ్రజ్యోతి) : సీఈఐఆర్ పోర్టల్ ద్వారా 8 సెల్‌ఫోన్లను గుర్తించి రికవరీ చేసి బాధితులకు అప్పగించినట్లు వనపర్తి జిల్లా, ఖిల్లాఘణపురం ఎస్ఐ సురేశ్ గౌడ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఫోన్లు పోగొట్టుకున్న 8 మంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని సీఈఐఆర్ యాప్ పోర్టల్ ద్వారా దాదాపు రూ.1.44 లక్షల విలువైన ఫోన్లను ట్రేస్ చేసి రికవరీ చేశారు. ఖిల్లాఘణపురం పోలీసుస్టేషన్ ఆవరణలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో బాధితులకు వాటిని అప్పగించారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నా, చోరీకి గురైనా వెంటనే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. మొబైల్ ఫోన్లను ట్రేస్ చేసి బాధితులకు అప్పగించడంలో ప్రత్యేక చొరవ చూపుతున్న క్రైమ్ కానిస్టేబుల్ లింగంను అభినందించారు.

గద్వాలలో విషాద-ఛాయలు

» కర్ణాటక రాష్ట్రంలో రోడ్డు ప్రమాదం
» మృతి చెందిన బ్యాంకు ఉద్యోగి భాస్కర్, భార్య, పిల్లలు
» కన్నీటి వీడ్కోలు పలికిన కాలనీవాసులు
» శోకసంద్రంలో కుటుంబ సభ్యులు, బంధువులు



నివాళి అర్పిస్తున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత, మునిసిపల్ మాజీ చైర్మన్ బీఎస్ కేశవ్, నాయకులు

గద్వాల క్రైం, మే 22 (ఆంధ్రజ్యోతి) : కర్ణాటక రాష్ట్రంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బ్యాంకు ఉద్యోగి భాస్కర్, అతడి భార్య పవిత్ర, కుమారుడు అభిరామ్, కుమార్తె జ్యోత్స్న మృతి చెందడంతో గద్వాల పట్టణంలోని బీసీ కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి. నలుగురి మృతదేహాలకు పోస్టుమార్టం అనంతరం గురువారం ఉదయం వారి స్వగృహానికి తీసుకొచ్చారు. అప్పటి వరకు సంఘటన విషయం తెలియని భాస్కర్ తల్లి ఉసేనమ్మ కుమారుడు, కోడలు, మనుమడు, మనుమరాళ్ల మృతదేహాలను చూసి కన్నీరు మున్నీరుగా విలపించింది. కుటుంబ సభ్యులు, బంధువులు, కాలనీ వాసులు విషాదంలో మునిగిపోయారు. అనంతరం మృతదేహాలను అంత్యక్రియలకు తరలించారు. విషయం తెలుసుకున్న భాస్కర్ మిత్రులు, సహచర ఉద్యోగులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

నివాళి అర్పించిన నాయకులు

బ్యాంకు ఉద్యోగి భాస్కర్, అతడి భార్య పవిత్ర, కుమారుడు అభిరామ్, కుమార్తె జ్యోత్స్న మృతి చెందిన విషయం తెలుసుకున్న పలువురు నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు వారి స్వగృహానికి చేరుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వారిలో డీసీసీబీ డైరెక్టర్ సుభాన్, నాయకుడు మోహన్‌రెడ్డి, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ బాబర్, మాజీ కౌన్సిలర్లు మురళి, శ్రీను ముదిరాజ్, ఆలయ కమిటీ డైరక్టర్ వెంకటేశ్, నాయకులు సాయి శ్యామ్‌రెడ్డి, గోవిందు తదితరులు ఉన్నారు.

● బాధిత కుటుంబ సభ్యులను జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత, మునిసిపల్ మాజీ చైర్మన్ బీఎస్ కేశవ్ పరామర్శించారు. వారి వెంట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గంజిపేట శంకర్, ఇసాక్, డీటీడీసీ నర్సింహులు, కోటేశ్, గోనుపాడు శ్రీనివాస్‌గౌడు, జగదీశ్, పాతపాలెం అనంద్‌గౌడు, దడవాయి నర్సింహులు, బిల్డర్ రామకృష్ణ తదితరులు ఉన్నారు.

● కాంగ్రెస్ పార్టీ జోగుళాంబ గద్వాల జిల్లా సీనియర్ నాయకుడు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి బాధిత కుటుంబానికి రూ. 20 వేల ఆర్థిక సాయం అందించారు. బాధిత కుటుంబ సభ్యులకు బీఆర్ఎస్ నాయకుడు బాసు హనుమంతు నాయుడు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట నాయకులు కోటేశ్, గంజిపేట రాజు, శ్రీరాములు, కామేశ్ తదితరులు న్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, నాయకులు రజక జయశ్రీ, రజక నర్సింహులు, డబ్బిలేటి నర్సింహ్మలు నివాళి అర్పించారు.

ప్రజాస్వామ్యానికి బీజేపీ తూట్లు

» జై భాపు, జైభీమ్ జై సంవిధాన్ పాదయాత్రలో మంత్రి జూపల్లి



ర్యాలీలో పాల్గొన్న జూపల్లి కృష్ణారావు, కాంగ్రెస్ నాయకులు

చిన్నంబావి, మే 22 (ఆంధ్రజ్యోతి) : ప్రజాస్వామ్యానికి బీజేపీ ప్రభుత్వం తూట్లు పొడుస్తున్నదని, రాజ్యాంగాన్ని రక్షించాల్సిన బాధ్యత ప్రతీ పౌరుడిపై ఉందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. వెల్టూరు నుంచి చిన్నమారూర్ వరకు గురువారం నిర్వహించిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్రలో పాల్గొన్నారు. అనంతరం చిన్నమారూర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయన మాట్లాడారు. అనంతరం వెలగొండ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. మియాపూర్‌లో పిడుగు పాటు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్, సీనియర్ నాయకులు బీచు పల్లి యాదవ్, కృష్ణ ప్రసాద్ యాదవ్, రామ చంద్రారెడ్డి, మండడి కృష్ణ శివ, యువ నాయకులు గంగారి శ్రీను, జగదీశ్, పెద్ద జగదీశ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ప్రభుత్వం, అధికారుల సహకారంతో మహిళల ఆర్థిక అభివృద్ధికి కృషి

● మండల మహిళా సమాఖ్య ఏపీఎం గంగాధర్



మాగనూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం, అధికారుల సహకారంతో మహిళా సంఘాలను ఆర్థిక శక్తిగా ఎదగడానికి కృషి చేస్తామని మహిళా సమాఖ్య మాగనూరు మండల ఏపీఎం గంగాధర్ తెలిపారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు.

మాగనూరు మండలంలో మహిళా సంఘాలు ఎన్ని ఉన్నాయి.?

మండలంలో 19 గ్రామ సంఘాలు, 408 చిన్న సంఘాలు ఉన్నాయి. సభ్యులు 4,500 మందికి పైగా ఉన్నారు.

2024-25 సంవత్సరం వరకు ఎన్ని సంఘాలకు, ఎన్ని రుణాలు ఇచ్చారు?

మండలంలో మహిళా సమైక్య ద్వారా 182 సంఘాలకు రూ.ఒక కోటి 36 లక్షల 30 వేల రుణాలు ఇచ్చాం.

విద్యార్థుల ఏకరూప దుస్తులు కుట్టడం పూర్తయ్యిందా?, మండలంలో ఎంత మంది విద్యార్థులు ఉన్నారు?

విద్యార్థుల ఏకరూప దుస్తులు 85 శాతం కుట్టడం పూర్తయింది. మండలంలో 3,041 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాలలు ప్రారంభమయ్యేలోపు ప్రతీ స్కూల్‌కు దుస్తులు పంపిస్తాం.

మహిళా సంఘాల సభ్యులకు ఏఏ పథకాల ద్వారా రుణాలు మంజూరు చేస్తున్నారు?

మహిళా సంఘాల సభ్యులకు బ్యాంకు లోన్, శ్రీనిధి లోన్, మండల మహిళా సమాఖ్య తదితర వాటి ద్వారా రుణాలు ఇస్తాం.

మందిపల్లి వరి కొనుగోలు కేంద్రం ద్వారా ఎన్ని బస్తాల ధాన్యం కొనుగోలు చేశారు? లారీల కొరత, గన్నీ బ్యాగుల కొరత ఉందా?

340 మంది రైతుల నుంచి లక్షా 45 వేల 250 బస్తాలు కొనుగోలు చేశాం. ప్రస్తుతం లారీల కొరత, గన్నీ బ్యాగుల కొరత లేదు.

పేట యార్డులో ధాన్యం క్రయ విక్రయాలు

నారాయణపేట, మే 22 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు గురువారం ధాన్యం విక్రయానికి వచ్చింది. ధాన్యం ధరలు ఈ విధంగా ఉన్నాయి.

ధాన్యం	క్వింటాల్	గరిష్ఠ	కనిష్ఠ
		(రూపాయలలో)	
వడ్లు సోనా	209.40	2,089	1,402
వడ్లు హంస	6.00	1,669	1,669
పెసళ్లు	0.98	7,512	7,512

న్యూస్ బాక్స్

డిగ్రీ కళాశాలకు కలెక్టర్ నిధుల నుంచి ఫర్నిచర్

మక్తల్, మే 22 (ఆంధ్రజ్యోతి): మక్తల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కలెక్టర్ సిక్తా పట్నాయక్ తన నిధుల నుంచి రూ.3 లక్షల విలువ చేసే కంప్యూటర్, టేబుళ్లు, ఫర్నిచర్ సమకూర్చారని కళాశాల ప్రిన్సిపాల్ నారాయణగౌడ్ గురువారం తెలిపారు. కళాశాలకు కంప్యూటర్లు, బెంచీలు సమకూర్చడంపై విద్యార్థులు, అధ్యాపకులు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రేపట్నుంచి ఆర్‌ఎస్‌ఎస్ ఖండ ప్రారంభిక్ వర్గ

నారాయణపేట న్యూటౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట నగర, ఊట్కూర్ ఖండ ప్రారంభిక్ వర్గ ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు పట్టణంలోని సింగార్‌బేస్ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నామని ఆర్‌ఎస్‌ఎస్ నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా సంఘం సర్వవ్యాప్తి అయ్యేందుకు దేశమంతటా ప్రారంభిక్ వర్గలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ వర్గకు వచ్చేవారు దండతో పాటు, ఏదైనా నిక్కరును వెంట తెచ్చుకోవాలని పేర్కొన్నారు.

కంటి వైద్య శిబిరం విజయవంతం


నారాయణపేట రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లక్ష్మీపూర్ గ్రామంలో లోకపల్లి అనంత్‌రెడ్డి జ్ఞాపకార్థం కందూరు రాంరెడ్డి కంటి ఆస్పత్రి, లయన్స్ క్లబ్ పాలమూరు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. శిబిరంలో కందూరు రాంరెడ్డి కంటి వైద్య నిపుణుడు డాక్టర్ ప్రమోద్ పరీక్షలు నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన 110మందికి పరీక్షలు నిర్వహించి, ఉచిత మందులను అందజేశారు. 20 మందిని ఆపరేషన్ నిమిత్తం రెఫర్ చేశారు. క్యాంపు ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది సత్యం, మాజీ సర్పంచ్ రాంమోహన్, అశోక్‌రెడ్డి, భీంరెడ్డి, ప్రవీణ్‌కుమార్, నర్సిములు ఉన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి

దామరగిద్ద, మే 22 (ఆంధ్రజ్యోతి): అథ్లెటిక్స్ క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఖేల్ ఇండియా అథ్లెటిక్స్ కోచ్ హరికదేవి సూచించారు. గురువారం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపులో భాగంగా మండల పరిధిలోని బాపన్‌పల్లి గ్రామంలో అథ్లెటిక్స్ క్రీడాకారులను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ, మిల్కాసింగ్ అకాడమీ డైరెక్టర్ శ్రీకాంత్, అథ్లెటిక్స్ కోచ్ మహేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను బలోపేతం చేసేందుకు కమిటీలు

» ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి



నర్వలో దరఖాస్తులు స్వీకరిస్తున్న టీపీసీసీ పరిశీలకులు వేణుగౌడ్, సంధ్యారెడ్డి, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డి

నర్వ/మాగనూరు/మక్తల్/ఊట్కూర్, మే 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన సందర్భంగా పార్టీని గ్రామ స్థాయిలో బలోపేతం చేసేందుకు అన్ని స్థాయిల్లో కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి తెలిపారు. గురువారం నర్వ మండల కేంద్రంలోని పార్టీ నాయకుడు జలంధర్‌రెడ్డి ఇంటి ఆవరణలో మండల అధ్యక్షుడు చెన్నయ్యసాగర్ అధ్యక్షతన నర్వ మండలంలోని గ్రామాల్లో కొత్త కమిటీల ఏర్పాటు కోసం సమావేశం నిర్వహించారు. సమావేశానికి టీపీసీసీ పరిశీలకుడు వేణుగౌడ్, సంధ్యారెడ్డితో పాటు, డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డి హాజరై, మాట్లాడారు. పార్టీ పదవుల నియామకం పారదర్శకంగా జరగాలనే ఉద్దేశంతో మండల అధ్యక్ష పదవి, గ్రామ అధ్యక్ష పదవుల కోసం దరఖాస్తులు తీసుకుంటామని వారు తెలిపారు. వచ్చిన వాటిలో అర్హులైన వారిని ఎంపిక చేసి అధిష్టానానికి పంపిస్తామన్నారు. పార్టీ కోసం పనిచేసే వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. పదవులు దక్కని వారికి వచ్చే స్థానిక ఎన్నికల్లో అవకాశం కల్పిస్తామన్నారు. అనంతరం అధ్యక్ష పదవులకు పోటీ పడే వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నర్వ మండల యూత్ అధ్యక్షుడు అశోక్‌గౌడ్, మండల మహిళా అధ్యక్షురాలు రాధ, కొత్తకోట సిద్ధార్థరెడ్డి, జగదాబిరెడ్డి, జగన్‌మోహన్ రెడ్డి, మాదిరెడ్డి రవీందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నాగన్నగారి శ్రీనివాస్‌రెడ్డి, వివేకవర్ధన్‌రెడ్డి, శరణప్ప, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అదేవిధంగా, మాగనూరు మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహస్వామి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఉమ్మడి మాగనూరు, కృష్ణ మండలాల కార్యకర్తల సమావేశానికి ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి, ఇన్‌చార్జి సంధ్యారెడ్డి, వేణుగౌడ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి హాజరై, మాట్లాడారు. అనంతరం మండల, గ్రామ కమిటీల ఏర్పాటుకు దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో మాగనూరు, కృష్ణ మండలాల అధ్యక్షులు ఆనంద్‌గౌడ్, రాజప్పగౌడ, నాయకుడు కొత్తకోట సిద్దార్థరెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, డబ్బా రాములు, శివరాంరెడ్డి, విజయగౌడ, మాజీ సర్పంచు విజయగౌడ తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూర్‌లో జరిగిన మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడారు. పార్టీ కోసం నిరంతరం పనిచేసే వారే నామినేషన్ వేయాలని అన్నారు. అంతకుముందు జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర పరిశీలకులు వెంకటేష్‌గౌడ్, సంధ్యరాణిలు మాట్లాడారు. సమావేశంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మక్తల్ పట్టణంలోని ఎమ్మెల్యే స్వగృహంలో గురువారం జిల్లా ఇన్‌చార్జిలు సంధ్యారెడ్డి, వేణుగౌడ్‌ల ఆధ్వర్యంలో పార్టీ మండల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, కొత్తకోట సిద్దార్థరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

భోజన సదుపాయం ప్రారంభించిన ఎమ్మెల్యే

మక్తల్ : మక్తల్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి తన స్వంత డబ్బులతో భోజన సదుపాయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు ఉచితంగా భోజనం అందిస్తామన్నారు. ఆసుపత్రిలో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. రోగులతో మాట్లాడి వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. అనంతరం డయాలసిస్ కేంద్రాన్ని తనిఖీ చేశారు.

తెలంగాణ తొలి సంఘ సంస్కర్త భాగ్యరెడ్డివర్మ

» కలెక్టర్ సిక్తా పట్నాయక్



భాగ్యరెడ్డివర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట టౌన్/నారాయణపేట న్యూటౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పాటు పడిన గొప్ప సంఘ సంస్కర్త భాగ్యరెడ్డి వర్మ అని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. గురువారం కలెక్టరేట్ ప్రజావాణి హాల్‌లో భాగ్యరెడ్డి వర్మ 137వ జయంతి ఉత్సవాల్లో పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దళిత సమాజోద్ధరణ, అంటరానితనం, మహిళల బాలికల విద్య కోసం ఎంతో కృషి చేశారని, జోగినీ వ్యవస్థను తొలగించడానికి పాటు పడ్డారని అన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, ఆర్డీవో రాంచందర్, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి ఉమాపతి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అబ్దుల్‌ఖలీల్, డీపీఆర్‌వో రషీద్, ఏవో జయసుధ, వెంకటేష్, సిబ్బంది ఉన్నారు.

ఎస్పీ కార్యాలయంలో...

పేట పట్టణంలోని ఎస్పీ కార్యాలయంలో భాగ్యరెడ్డివర్మ చిత్రపటానికి ఎస్పీ యోగేష్ గౌతమ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ దళితుల హక్కులు, సమానత్వం కోసం పోరాడిన గొప్ప వ్యక్తి భాగ్యరెడ్డివర్మ అన్నారు. హైదరాబాద్ సంస్థానంలో అనేక దళిత బాలికల పాఠశాలలను స్థాపించి వేల మంది విద్యార్థులకు విద్య అందించారని పేర్కొన్నారు. ఏఎస్పీ రియాజ్ హుల్‌హక్, ఆర్‌ఎస్‌ఐలు, డీపీవో, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



భాగ్యరెడ్డివర్మ చిత్రపటానికి నివాళులర్పించిన ఎస్పీ యోగేష్ గౌతమ్, పోలీసు సిబ్బంది

పోక్సో యాక్ట్‌పై అవగాహన

మక్తల్‌రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): మక్తల్ మండలంలోని భూత్పూర్ గ్రామంలో జిల్లా బాలల రక్షణ విభాగం ఆధ్వర్యంలో బాలల చట్టాలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ జి.నరసింహులు మాట్లాడుతూ బాల్య వివాహాలు, బాల కార్మికులు లేని గ్రామంగా మారటానికి గ్రామ ప్రజల భాగస్వామ్యం అవసరమని అన్నారు. పిల్లలు ఎటువంటి సమస్యలకైనా గురవుతుంటే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్‌కు ఎప్పుడైనా సమాచారం ఇవ్వాలని కోరారు. లీగల్ అడ్వకేట్ కవిత మాట్లాడుతూ చిన్న వయసులో పిల్లలకు పెళ్లిళ్లు చేయడం నిషేధమని, పెళ్లిళ్లు జరిపిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామ పెద్దలు, మహిళా సంఘం సభ్యులు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ కార్యదర్శి, జిల్లా బాలల పరిరక్షణ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు రూ.600 కూలీ ఇవ్వాలి

» మే 26న జిల్లా కేంద్రంలో జరిగే ధర్నాకు తరలిరావాలి

» సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్రామ్‌రెడ్డి



అమీన్‌పూర్ గ్రామంలో ఉపాధి కూలీలకు కరపత్రాలు పంచుతున్న వెంకట్రామ్‌రెడ్డి

ఊట్కూర్/నారాయణ పేట రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు ప్రతీ రోజు రూ.600 కూలీ చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్రామ్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఊట్కూర్ మండలంలోని అమీన్‌పూర్ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆయన సందర్శించి, కూలీలతో మాట్లాడారు. ఉపాధి కూలీలకు సంవత్సరానికి 200 రోజులు పని కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి 40 శాతం కోతను విధించిందని తెలిపారు. ప్రజలకు ఉపాధి కల్పించే వ్యతిరేక చర్యలకు ప్రభుత్వం పూనుకుందని అన్నారు. ఉపాధి కూలీలకు న్యాయం చేయాలని కోరుతూ మే 26న కలెక్టరేట్ ముందు జరిగే ధర్నాకు ఉపాధి కూలీలందరు తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. మండల నాయకులు శంకర్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

అదేవిధంగా, పేట మండలం శేర్నపల్లి, సింగారం గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి హామీ పనుల ప్రదేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రాం కూలీలనుద్దేశించి మాట్లాడారు. ఈనెల 26న కలెక్టరేట్ ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్నాకు ఉపాధి కూలీలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నరహరి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి పవన్‌కుమార్, కూలీలు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ

నారాయణపేట న్యూటౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీగణపతి దేవాలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ వేడుకలను రెండురోజుల పాటు ఘనంగా నిర్వహించారు. మహోత్సవాల్లో భాగంగా గురువారం అర్చకుడు విద్యాధర్‌దీక్షిత్ మంత్రోచ్చరణాల మధ్య విశేష పూజలు, విగ్రహ ప్రతిష్ఠాపనతో పాటు, ప్రాణప్రతిష్ఠ చేశారు. అనంతరం స్వామివారికి నైవేద్యం సమర్పించి, భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జ్ఞానేశ్వర్‌గౌడ్, గౌరీశంకర్, అనిల్, విష్ణువర్ధన్‌రెడ్డి, అశ్విన్, బాల్‌చందర్, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

బొలెరో, బైక్ ఢీ.. యువకుడి మృతి

మక్తల్, మే 22 (ఆంధ్రజ్యోతి): బొలెరో, బైక్ ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం అర్ధరాత్రి జాతీయ రహదారి-167 బొందల్‌కుంట స్టేజీ వద్ద చోటు చేసుకుంది. ఎస్‌ఐ భాగ్యలక్ష్మీరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నర్వ మండలం పాతర్‌చెడ్ గ్రామానికి చెందిన రామకృష్ణ(36) తన బంధువు మేస్త్రీ సైలేష్‌తో కలిసి బుధవారం సాయంత్రం బైక్‌పై మక్తల్‌కు బయలుదేరారు. పనులు పూర్తి చేసుకొని అర్ధరాత్రి సమయంలో తిరిగి బైక్‌పై వస్తుండగా బొందల్‌కుంట స్టేజీ వద్ద ఎదురుగా వస్తున్న బొలెరోను ఢీకొన్నారు. ప్రమాదంలో రామకృష్ణ అక్కడికక్కడే మృతిచెందగా సైలేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సైలేష్‌ను మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. రామకృష్ణ మృతదేహాన్ని మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య అరుణతో పాటు, ఓ కుమారుడు ఉన్నారు. ఘటనపై మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మారిన విద్యుత్ అధికారుల ఫోన్ నెంబర్లు

నారాయణపేట టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విద్యుత్ శాఖ అధికారులకు నూతన ఫోన్ నెంబర్లను కేటాయించిందని ఎస్ఈ వెంకటరమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మారిన నెంబర్లు మండలాల వారీగా ఇలా ఉన్నాయి.

ఎస్ఈ వెంకటరమణ	87124 70296,
డీఈ ఆపరేషన్	87124 70299,
ఏడీఈ మక్తల్	87124 70302,
ఏడీఈ నారాయణపేట	87124 70304,
ఏడీఈ కోస్గి	87124 70305,
ఏఈ ధన్వాడ	87124 70306,
ఏఈ నారాయణపేట	87124 70308,
ఏఈ మాగనూరు	87124 70310,
ఏఈ మరికల్	87124 70311,
ఏఈ మక్తల్	87124 70312,
ఏఈ పేట రూరల్	87124 70313,
ఏఈ ఊట్కూర్	87124 70314,
ఏఈ కోస్గి	87124 70315,
ఏఈ మద్దూర్	87124 70316,
ఏఈ దామరగిద్ద	87124 70317

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

నారాయణపేట, మే 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. జిల్లా నోడల్ అధికారి సుదర్శన్‌రావు ఆధ్వర్యంలో జిల్లాలోని 11 కేంద్రాల్లో పరీక్షలు సజావుగా కొనసాగాయి. ఫస్ట్ ఇయర్ పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగాయి. మొదటి రోజు జనరల్ విద్యార్థులు 682 మందికి 656 మంది ఫస్ట్ ఇయర్ పరీక్షలు రాయగా, 26 మంది గైర్హాజరయ్యారు. వొకేషనల్ 47 మందికి 45 మంది పరీక్షలు రాయగా ఇద్దరు గైర్హాజరయ్యారు. మొత్తం ఫస్టియర్‌లో 729 మందికి 701 మంది పరీక్షలు రాయగా 28 మంది గైర్హాజరయ్యారు.

మొదటి రోజు సెకండియర్ పరీక్షలు మధ్యాహ్నం 2:30 నుంచి 5:30 గంటల వరకు జరిగాయి. జనరల్ విద్యార్థులు 154 మందికి 142 మంది పరీక్షలు రాయగా 12 మంది గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 11 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. నారాయణపేటలో మూడు, మక్తల్‌లో మూడు, కోస్గిలో రెండు, మద్దూర్, మరికల్, ధన్వాడలలో ఒకటి చొప్పున పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లాలోని ఐదు కేంద్రాల్లో జనరల్ విద్యార్థులతో పాటు వొకేషనల్ విద్యార్థులు పరీక్షలు రాశారు. 11 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 11 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, ముగ్గురు అడిషనల్ సూపర్‌వైజర్లు, ఇద్దరు కస్టోడియన్స్, సిట్టింగ్ స్క్వాడ్స్ ఒక బృందం, ఫ్లయింగ్ స్క్వాడ్స్ బృందం పరీక్షలను పర్యవేక్షించారు.

జీపీవో పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



జీపీవోల పరీక్ష ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

» అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

నారాయణపేట టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): గ్రామపాలన అధికారులు(జీపీవో) పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జీపీవో పరీక్షలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 25న ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు జరిగే పరీక్షకు 109 మంది అభ్యర్థులు పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. నారాయణపేటలోని వేద సరస్వతి జూనియర్ కళాశాలలో పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్లపై హెచ్‌వోడీ అటెస్టు చేయించాలన్నారు. అలాగే ఐడీ ప్రూఫ్ తీసుకొని పరీక్షకు హాజరు కావాలని, హెల్ప్‌లైన్ నెంబర్ 9154283913కు ఫోన్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రంలో ఎస్పీ ఆధ్వర్యంలో బందోబస్తు ఉంటుందని తెలిపారు. ఆర్డీవో పరీక్షను పర్యవేక్షిస్తారన్నారు. డీఐఈఓ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. నోడల్ అధికారులు, డీఎంహెచ్‌వో, విద్యుత్, మునిసిపల్ శాఖలకు పనుల కేటాయింపులు చేశారు. డీటీవో హరిప్రసాద్, ఏవో జయసుధ, అధికారులు పాల్గొన్నారు.

విధులు సక్రమంగా నిర్వహించాలి : డీఆర్డీవో

మక్తల్ రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించాలని, సమయపాలన పాటించాలని డీఆర్డీవో మొగులప్ప ఉపాధి హామీ సిబ్బందిని ఆదేశించారు. గురువారం మక్తల్ పట్టణంలోని ఉపాధి హామీ, ఐకేపీ కార్యాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఐకేపీ కార్యాలయంలో విద్యార్థుల యూనిఫామ్‌లను పరిశీలించి, సిబ్బందితో మాట్లాడారు. అనంతరం ఉపాధి హామీ కార్యాలయాన్ని సందర్శించి, హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆ తర్వాత ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ ఉపాధి హామీ సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావాలని, కూలీలకు ఎప్పటికప్పుడు పేమెంట్లు చేయాలని, అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రస్తుతం మక్తల్ మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న సందర్భంగా మట్టి తవ్వే పనులు సులభంగా ఉంటాయని, గ్రామాల్లో కూలీల సంఖ్య పెంచాలని, కూలీలకు గరిష్ఠ వేతనం రూ.307 వచ్చేలా కొలతలు ఇచ్చి వారితో పనులు చేయించాలని సూచించారు. ఏపీవో సత్యప్రకాష్, ఈసీ శ్రీనివాసులు, టీఏలు యుగంధర్, చంద్రిక, లలిత, సీవోలు తదితరులున్నారు.

ఆహార నియమాలు పాటించాలి

» ఎన్‌సీడీ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జయచంద్రమోహన్

» అసంక్రమిత వ్యాధులపై వైద్య సిబ్బందికి అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జయచంద్రమోహన్, హాజరైన వైద్య సిబ్బంది

నారాయణపేట, మే 22 (ఆంధ్రజ్యోతి): ఆహార నియమాలు పాటించి అసంక్రమిత రోగాలను దరి చేరకుండా చర్యలు తీసుకుంటు అనునిత్యం యోగా సాధన చేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ జయచంద్రమోహన్ అన్నారు. గురువారం నారాయణపేట మండలం అప్పక్‌పల్లి మెడికల్ కాలేజీలో జిల్లాలోని ప్రాథమిక విద్య వైద్యాధికారులు, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు, నర్సింగ్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లకు ఒక రోజు ఎన్‌సీడీ(అసంక్రమిత వ్యాధులు) కార్యక్రమంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమాన్నుద్దేశించి ఆయన మాట్లాడారు. అసంక్రమిత వ్యాధులు జీవన శైలి మార్పు వల్ల, ఆహార నియమాల్లో మార్పుల వల్ల సంభవిస్తాయన్నారు. ఆహార నియమాలు పాటించి జీవన శైలిలో మార్పు రావాలని, 30 ఏళ్లు పైబడిన వారు ప్రతీరోజు అరగంట పాటు యోగా సాధన చేయాలన్నారు. ఎన్‌సీడీ రాష్ట్ర కోఆర్డినేటర్ అబ్దుల్‌వాసే మాట్లాడుతూ అసంక్రమిత వ్యాధులు, హైబీపీ, డయాబెటిస్, ఓరల్ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్, సర్వేకల్ క్యాన్సర్ వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో శైలజ, సత్యప్రకాష్‌రెడ్డి, విజయ్‌కుమార్, అశోక్‌కుమార్ తదితరులున్నారు.

హక్కులపై అవగాహన కలిగి ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న లక్ష్మీపతిగౌడ్

నారాయణపేట రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అమ్మిరెడ్డిపల్లి గ్రామంలో గురువారం సాయంత్రం పేట జిల్లా న్యాయ సేవా సంస్థ లీగల్ సర్వీస్ సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పీపీ కె.సురేశ్, డిఫెన్స్ కౌన్సిల్ లక్ష్మీపతి గౌడ్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ నాగేశ్వరిలు మాట్లాడుతూ రాజ్యాంగం అందరికీ సమాన హక్కులు కల్పించిందన్నారు. ప్రజలు వాటిపై అవగాహన కలిగి ఉన్నప్పుడే తమ హక్కులను పొందుతారన్నారు. బాల్యవివాహాలు చేయొద్దని, బాలకార్మికుల చట్టాలు, నిత్యావసర సరుకుల చట్టం, వరకట్న వేధింపులు, సఖీ సెంటర్, ఓల్డేజ్ హోం, తదితర విషయాలపై అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి మహేష్, జిల్లా వెల్ఫేర్ అధికారి తిరుపతయ్య, పారా లీగల్ వలంటీర్లు కె.యాదమ్మ, లక్ష్మీ, గ్రామస్థులు పాల్గొన్నారు.

నాటిన మొక్కలు బతికే విధంగా చూడాలి

మాగనూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): వన మహోత్సవంలో భాగంగా నాటిన మొక్కలను పరిశీలించి వంద శాతం మొక్కలు బతికే విధంగా ప్రణాళిక చేపట్టాలని ఉపాధి హామీ సిబ్బంది జిల్లా స్థాయి అధికారి చంద్రశేఖర్ ఉపాధి సిబ్బందిని కోరారు. గురువారం మాగనూరు మండలంలోని ఉజ్జల్లి, అమ్మపల్లి, ఓబులాపూర్ గ్రామాల్లో చేపట్టినటువంటి రూఫ్‌టాప్, రెయిన్‌వాటర్, హార్వెస్టింగ్ స్ట్రక్చర్స్‌ను పరిశీలించారు. ప్రతీ నీటి చుక్కను ఒడిచి పట్టే విధంగా భూగర్భ జలాల పెంపునకు కృషి చేయాలన్నారు. అనంతరం ఉపాధి హామీ కార్యాలయంలో పనులకు సంబంధించిన వర్క్ ఫైల్‌ను, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సాంకేతిక అధికారి హర్షవర్ధన్‌రెడ్డి, మేటీలు సోమలింగం, నరేష్, ఖాజాహుస్సేన్ తదితరులున్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య



ప్రభుత్వ కళాశాలలో చేరాలని సూచిస్తున్న అధ్యాపకులు

దామరగిద్ద, మే 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందుతుందని సీనియర్ అధ్యాపకుడు రాంరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో పదవ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులను కలిసి కళాశాలల్లో ఉన్న మౌలిక సదుపాయాల గురించి వివరించారు. విద్యార్థులను ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించాలని విన్నవించారు. ప్రభుత్వ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో నాణ్యమైన విద్యాబోధన ఉంటుందని తెలిపారు. విద్యార్థులకు ఉచిత అడ్మిషన్‌తో పాటు, స్కాలర్‌షిప్ సౌకర్యం ఉంటుందని తెలిపారు. అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. అధ్యాపకులు రషీద్, రవికుమార్ తదితరులున్నారు.